క్లుప్తంగా

రోగులకు మెరుగైన వైద్యం అందించండి



నర్సాపురం పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న రీజనల్ డైరెక్టర్

రుద్రవరం: పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని రీజనల్ డైరెక్టర్ త్యాగరాజు అన్నారు. మండల పరిధిలోని నార్సపురం పీహెచ్‌సీని గురువారం మలేరియా జోనల్ అధికారితో కలిసి తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిసరాల శుభ్రత, రికార్డులు, రోగుల సంఖ్యపై ఆరా తీశారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మలేరియా, డెంగీ వంటి జ్వరాలు ప్రబలాయా అని అడిగి తెలుసుకున్నారు. వాతావరణం సరిగ్గా లేదని, గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారి బాబు, సూపర్‌వైజర్ భూలక్ష్మి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి ఉన్నారు.

మహమ్మద్ ఫైజుల్లాకు డాక్టరేట్ ప్రదానం



నంద్యాల(న్యూటౌన్): మహమ్మద్ ఫైజుల్లాకు పీహెచ్‌డీ ప్రదానం చేశారని ఆయన గురువారం తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉర్దూ ప్రొఫెసర్ మహమ్మద్ అమీరుల్లా సారథ్యంలో ఉర్దూ నవలల్లో నార్సిజం అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించానని, నవంబర్ 1న విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి నోటిఫికేషన్ ద్వారా ఉర్దూలో పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించారని చెప్పారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పదేళ్లు పని చేశానని, ప్రస్తుతం రాయచోటి ప్రభుత్వ కళాశాలకు బదిలీ అయినట్లు తెలిపారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్థానిక సాయిబాబానగర్‌లో ఉన్న జూనియర్ కళాశాల హాస్టల్ విద్యార్థులకు గురువారం రాత్రి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ చేశారు. నంద్యాల శాఖ కన్వీనర్ దస్తగిరి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ వేణుగోపాల్ పాల్గొన్నారు. దస్తగిరి మాట్లాడుతూ చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు దుప్పట్లు అందజేశామని చెప్పారు.

మద్యం విక్రేతల అరెస్ట్



పట్టుబడిన బైక్, మద్యం సీసాలను చూపుతున్న అధికారులు

ఆళ్లగడ్డ: జిల్లా టాస్క్‌ఫోర్స్, ఆళ్లగడ్డ ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా గురువారం బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. ఆళ్లగడ్డ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరం మండలం ఆలమూరు, ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లి, గోస్పాడు మండలం ఎం.క్రిష్ణాపురం గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించామన్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 71 మద్యం సీసాలు, ఒక మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌దాస్, ఆళ్లగడ్డ ఎస్ఐలు సరస్వతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వలంటీర్ దినోత్సవం



మధుసూదనరావును సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ వలంటీర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు వెంకటరావు మాట్లాడారు. అంతర్జాతీయ వరదలకు సంబంధించిన ఆచరణాత్మక ఉదాహరణలను, వలంటీర్‌లు ఎలా ముందుకు వచ్చారో ఎస్టేట్ మేనేజర్ ప్రగతిరెడ్డి వివరించారు.

లింగ ఆధారిత హింస నిర్మూలనపై అవగాహన..

లింగ ఆధారిత వాయిలెన్స్ ఎలిమినేట్‌పై ప్రచారం చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన రావు అన్నారు. గురువారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లింగ ఆధారిత హింసను నిర్మూలించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు.

పడకేసిన 'పుర'పాలన

- దీర్ఘకాలిక సెలువుపై కమిషనర్
- ఇన్‌చార్జ్ వద్దంటూ సెలవుపై వెళ్లిన మరో ఇద్దరు అధికారులు
- కమిషనర్, ఏఈ, టౌన్ ప్లానింగ్‌తో పాటు కీలక పోస్టులు ఖాళీ
- కుంటుపడుతున్న అభివృద్ధి
- డీజిల్ లేక ఆగిపోతున్న సెత్తసేకరణ వాహనాలు



ఆళ్లగడ్డ పురపాలక సంఘం

ఆళ్లగడ్డ: పురపాలక సంఘంలో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీని ప్రభావం అభివృద్ధి పనులపై పడుతోంది. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో పట్టణంలో పరిపాలన పడకేసింది. కీలక పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు తీసుకోవడానికి విముఖత చూపుతున్నారు. విధులు నిర్వహిస్తున్న పోస్టులకే సెలవుపై వెళ్తుండడంతో పనులపై పర్యవేక్షణ కరవైంది. పాలనాపరంగా ఇబ్బందులు ఏర్పడడంతో పాటు ప్రజా సమస్యలు పరిష్కారం కావడంలేదు.

కమిషనర్ లేని పురపాలక సంఘం

ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట్రామిరెడ్డి నవంబర్ 15వ తేదీ ఉన్నట్టుండి దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దీంతో సంబంధిత శాఖ అధికారులు ఏఈగా విధులు నిర్వహిస్తున్న దస్తగిరెడ్డికి 16వ తేదీ నుంచి ఇన్‌చార్జి కమిషనర్ (ఎఫ్ఏసీ) గా బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే తాను ఆ బాధ్యతలు స్వీకరించేది లేదని వారం రోజులుగా మొండికేశారు. కనీసం కమిషనర్ సిమ్ కూడా తీసుకోలేదు. అయితే ఉన్నతాధికారులు, టీడీపీ నేత ఒత్తిడి చేయడంతో నవంబర్ 30వ తేదీ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు తీసుకుని 1, 2వ తేదీ అంటే మూడు రోజులు మాత్రమే బాధ్యతలు నిర్వర్తించిన దస్తగిరెడ్డి ఈ నెల 3వ తేదీ నుంచి దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారి రాణికి 5వ తేదీ నుంచి ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు చూసిన వెంటనే రాణి బాధ్యతలు తీసుకోకుండానే తానూ సెలవుపై వెళ్తున్నానని ఉన్నతాధికారులకు లీవ్ లెటర్ ఆన్‌లైన్‌లో పంపించడం చర్చనీయాంశం అవుతోంది. కాగా కమిషనర్‌తో పాటు ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు సెలవుపై వెళ్లడంతో కార్యాలయంలో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులకు కమిషనర్ ఇన్‌చార్జి ఇచ్చేందుకు అవకాశం లేదు. దీంతో కొత్త కమిషనర్ ఎవరైనా వచ్చే వరకు ఇక్కడ కమిషనర్ లేకుండానే పాలన కొనసాగనుంది.

కొత్త కమిషనర్ వచ్చే వరకు జీతాలు ఎలా?

మున్సిపల్ పరిధిలో 10 సచివాలయాలతో పాటు సుమారు 100 మంది పారిశుద్ధ్య కార్మికులు, మరో 70 మంది కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ కమిషనర్ లేక జీతాలు చేయలేదు. ఇప్పుడు కొత్త కమిషనర్ ఎవరైనా 10వ తేదీ లోపు వచ్చి జీతాలు పెడితేనే ఈ నెల జీతాలు వస్తాయని లేకుంటే ఈ నెల జీతాలు వచ్చే పరిస్థితి లేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్ విధులపై విముఖత

ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహించేందుకు స్థానిక అధికారులు విముఖత చూపుతున్నారు. కాగా కొత్తవారు వచ్చేందుకు కూడా ఎవరు ఇష్టం పడడంలేదని తెలుస్తోంది. కొంత మంది టీడీపీ నాయకులు రాజకీయ పలుకుబడితో చేయని పనులకు బిల్లులు మంజూరు చేయాలని ఒత్తిడి చేయడంతో పాటు అధికార పార్టీకి అనుకూలంగా లేని వారి కట్టడాలు నిర్ధాక్షిణ్యంగా కూల్చి వేయాలని హుకుం జారీ చేస్తుండడం ఇక్కడ పరిపాటిగా మారింది. తమ మాటవినని కమిషనర్‌ను తీవ్ర స్థాయిలో మందలించడంతో ఆయన సెలవుపై వెళ్లాడని తెలిసి ఇక్కడికి వచ్చేందుకు ఇష్టపడడం లేదని తెలుస్తోంది.

డీజిల్ లేక ఆగిపోతున్న వాహనాలు

కీలక పోస్టుల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు ముగ్గురూ ఒకేసారి సెలవు పెట్టడంతో పరిపాలనపరంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పనుల పర్యవేక్షణ కరవైంది. పాలనపరంగా ఇబ్బందులు ఏర్పడడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. గురువారం చెత్త తరలించే వాహనానికి డీజిల్ అయిపోవడంతో రోడ్డుపై ఆగిపోయింది. దీంతో ఓ ఉద్యోగి సొంతంగా రూ.1000 డీజిల్ పోయించి వాహనాన్ని కార్యాలయానికి తీసుకురావడం గమనార్హం.

కీలక పోస్టులకు సచివాలయ ఉద్యోగులే దిక్కు

మున్సిపల్ శాఖలో కీల ఉద్యోగులు సెలవు పై వెళ్లడంతో ఇన్‌చార్జి ఏఈ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లుగా సచివాలయ ఉద్యోగులను నియమించుకుని పరిపాలన కొనసాగిస్తున్నారు.

నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి

గోస్పాడు: తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయి ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు మార్క్, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం సీపీఎం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పైర్లు చేతికొచ్చే సమయంలో వర్షాలతో రైతులు పంటలు కోల్పోతున్నారన్నారు. ఒకవైపు దిగుబడులకు మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లేదని, మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక అవస్థలు పడుతున్నారని తెలిపారు. పంటల బీమాకూడా రైతులే చెల్లించాలని ప్రభుత్వం చెప్పడంతో వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. చెన్నయ్య, కరీముల్లా, ఆనంద్, దావీదు, పుల్లయ్య పాల్గొన్నారు.

7న తల్లిదండ్రుల సమావేశం

ఉయ్యాలవాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీ పాఠశాలల్లో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వీరప్రతాప్ రెడ్డి తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుంచి సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, దాతలు, పిల్లల తల్లిదండ్రులు, విద్యా శ్రేయోభిలాషులు పాల్గొలన్నారు. విద్యార్థుల ప్రగతి గురించి తల్లిదండ్రులతో చర్చించి ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. తల్లిదండ్రుల సమావేశం నిర్వహణ నిమిత్తం మండలంలోని 32 పాఠశాలలకు రూ. 59,600 నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న ఆర్‌డీఓ విశ్వనాథ్



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి గోవిందనాయక్

నంద్యాల(అర్బన్): నంద్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డీఓ విశ్వనాథ్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని 220 గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజూ 14 గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 7వ తేదీన మెగా పేరెంట్స్ డే మినహా అన్ని రోజుల్లో సదస్సులు ఉంటాయన్నారు. సదస్సులో నోడల్ అధికారి, తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, వీఆర్ఓ, గ్రామ సర్వేయర్‌లతో పాటు ఎండోమెంట్, వక్ఫ్, ఫారెస్ట్ అధికారులు పాల్గొంటారని చెప్పారు. ఆధారాల ఆధారంగా భూ సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. పీజీఆర్ఎస్‌లో నంద్యాల డివిజన్‌కు సంబంధించి 1,075 సమస్యలు రాగా ఇప్పటి వరకు 970 పరిష్కారమయ్యాయని, మిగిలిన వాటిని త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రియదర్శిని, కార్యాలయ ఏఓ హసీనా పాల్గొన్నారు.

రుద్రవరం: భూసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మల్లిఖార్జునరావు అన్నారు. మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఏవైనా భూ సమస్యలతో పాటు రెవెన్యూ పరమైన ఇతర సమస్యలు ఉంటే రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీ ఇచ్చిన 45 రోజుల్లోపు వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

దొర్నిపాడు: గ్రామ రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని పశుసంవర్థకశాఖ ఏడీఏ (మండల ప్రత్యేకాధికారి) గోవిందనాయక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ సుభద్రతో కలిసి వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 6న అర్జునాపురం, 10న దొర్నిపాడు, 11న రామచంద్రాపురం, 12న కొండాపురం, 13న డబ్ల్యూ గోవిందిన్నె, 17న డబ్ల్యూకొత్తపల్లె, 18న గుండుపాపల, 19న బుర్రారెడ్డిపల్లె, 20 క్రిష్టిపాడు, 21న చాకరాజువేముల గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యకర దిగుబడి



ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

రుద్రవరం: రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వినియోగించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని మండల వ్యవసాయాధికారి నాగేంద్ర ప్రసాదు అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా గురువారం రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు హరిత విప్లవంలో భాగంగా అధిక దిగుబడినిచ్చే రకాలను సాగు చేస్తూ రసాయ ఎరువుల వాడకానికి అలవాటు పడ్డారని తెలిపారు. అలా కాకుండా సేంద్రీయ ఎరువులు వినియోగిస్తే భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూసారం పెరగాడానికి దోహద పడతాయని వివరించారు. ఆర్యోగకర దిగుబడి పొందవచ్చని చెప్పారు. వర్మీ కంపోస్టు, పచ్చిరొట్టె, పశువుల ఎరువులు, జీవన ఎరువులతో నేల ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ రైతు సుధాకర్ మాట్లాడుతూ.. రసాయన ఎరువుల ద్వారా పండించే పంటల ఉత్పత్తులతో ప్రజలు ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం కషాయాలు వినియోగించడం వల్ల కాలుష్యం తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజు, ప్రకృతి వ్యవసాయ ఎంసీఆర్పీ బాలస్వామి, పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి కారకులను శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మౌలాలి

నంద్యాల(న్యూటౌన్): రాయచోటి మండలంలో ఉపాధ్యాయుడి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామపక్కీర్‌రెడ్డి, చాంద్‌బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే..ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడి మృతికి నివాళులర్పించారు. సమగ్రమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్ అజీజ్, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు షమీన్‌బాను, ప్రధాన కార్యదర్శి అంజాద్‌షరీఫ్ కోరారు. ఉపాధ్యాయుడి మృతికి నంద్యాల ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మౌలాలి, అజామ్‌బేగ్ సంతాపం తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.శివశంకర్, రాష్ట్ర కార్యదర్శులు గోపాలకృష్ణ, ఇక్బాల్ డిమాండ్ చేశారు. ఎస్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

చాగలమర్రి: అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మహ్మద్ ఇజాజ్ అహ్మద్ మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాల విరామ సమయంలో ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లాలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నేత, ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా, ప్రధాన కర్యాదర్శి సుబ్బారావు, మాహబూబ్‌హుసేన్ మాట్లాడుతూ.. మృతిపై విచారణ చేసి నిందితులను శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు శివశంకర్, నారాయణరెడ్డి, ప్రసాద్, నరసింహులు, సుజీవ్, సుబ్బారెడ్డి, పుట్టాలయ్య, మన్సూర్, కేజీబీవీ ఎస్ఓ సునితా, పద్మావతి, లలితకుమారి, వసుంధర, జైనులాబిదిన్, ఓబుళపతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ దినోత్సవం



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



దొర్నిపాడు: ఉమాపతినగరంలో..



పెద్దబోధనం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో గేయాలను పాడిస్తున్న కార్యకర్త

చాగలమర్రి: మండల పరిధిలోని పెద్దబోధనం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య (ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి నెలా 2వ గురువారం నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్త పి.రామసుబ్బమ్మ తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులను ఆకర్షించే విధంగా రకరకాల బొమ్మలు, ఆట వస్తువులతో అంగన్‌వాడీ కేంద్రాన్ని అలంకరించారు. కేంద్రానికి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులకు వారి ప్రతిభను తెలిపేందుకు పిల్లలతో అభినయ గేయాలు పాడించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధి, సంరక్షణ, పూర్వ ప్రాథమిక విద్య తదితర విషయాలు అందరికీ తొందరగా అందించడం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. విటన్నింటిని పాటించినప్పుడే పిల్లలు 1వ తరగతిలో చేరేందుకు సిద్ధంగా ఉంటారని చెప్పారు. కేంద్రంలో 21మంది పిల్లలు, 10మంది గర్భిణులు, 11మంది బాలింతలు ఉన్నారని వివరించారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య

రుద్రవరం: ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కార్యకర్తలు మనోజ, రాజ్యలక్ష్మి, పద్మావతి కోరారు. మండలంలోని ఎల్లావత్తుల, డీ.కొట్టాల, చిన్నకంబలూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య సంరక్షణ, విద్యపై వివరించారు. అలాగే ఆటపాటలు, కథలు, జనాత్మకత, సంసిద్ధత వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పిల్లల మేథో వికాసానికి, భాషాభివృద్ధికి, మానసిక అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహద పడతాయని తెలిపారు.

ఆటపాటలతో విద్యనేర్పాలి

దొర్నిపాడు: అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ సూచించారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డేను నిర్వహించారు. 3 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోని మెటీరియల్ ఉపయోంచి నేర్చుకున్న విద్యను తల్లిదండ్రుల సమక్షంలో చూపించారు. చిన్నిచిన్ని మాటలతో వారు అభ్యసిస్తున్న విద్యను చెప్పే విధానం చూసి తల్లిదండ్రులు సంతోషించారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు.

వదలని వాన.. అన్నదాతల ఆందోళన



క్రిష్టిపాడులో పొగాకు తోరణాలకు కప్పిన పట్టల్లో నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతు,



దొర్నిపాడులో నేలవాలిన వరిని కట్టలు కడుతున్న కూలీలు

దొర్నిపాడు: అల్పపీడన ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను కలవరపెడుతున్నాయి. వర్షాలు వరి, పత్తి, కంది, పొగాకు, శనగ పంటలపై ప్రభావం చూపుతోంది. పొగాకు తోరణాలు కట్టినప్పటి నుంచి రైతులకు కంటిమీద కునుకు లేకుండాపోయింది. తోరణాలు తడవకుండా పట్టలు కప్పగా గాలివానకు కొన్ని చోట్ల లేచిపోగా మరికొన్ని ప్రాంతాల్లో వర్షపు నీటితో పట్టలు నిండి కూలిపోయాయి. దీంతో పొగాకు వర్షానికి తడవడంతో పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు. ఇక వరి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎక్కడ చూసినా నేలవాలగా రైతులు కట్టలు కట్టుకోవడానికి అగచాట్లు పడుతున్నారు. శనగకు ఇప్పటికే తేమశాతం అధికం కావడంతో వేరుకుళ్లతో మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి.



- ఈ చిత్రంలో తడిసిన పొగాకును చూపుతున్న రైతు పేరు సుధాకర్. క్రిష్టిపాడులో 2 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని సాగు చేశాడు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటంతా తడిసిపోయింది. పొలాల్లోనే తోరణాలు కట్టి వర్షాలకు తడవకుండా పట్టలకు కప్పారు. అయినా అధిక వర్షానికి తోరణాలన్నీ నేలవాలాయి. దీంతో పొగాకు అంతా తడిసి ముద్దయ్యింది.

కార్తీకమాస శివదీక్ష విరమణకు ఏర్పాట్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు కార్తీకమాస శివదీక్షా విరమణ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఈఓ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఐదు రోజుల పాటు పాతాళగంగ మార్గములోని శివదీక్షా శిబిరాలలో దీక్ష విరమణ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామన్నారు. నవంబరు 2న శివమండల దీక్షను, 21న అర్ధమండలదీక్షను స్వీకరించిన భక్తులు దీక్షను విరమించవచ్చునని చెప్పారు. దీక్షావిరమణ సందర్భంగా 11వ తేదీ ఉదయం 7.30గంటలకు స్వామివారి ఆలయ దక్షిణద్వారం వద్ద స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేయించి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

7న సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవం

శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 7న మార్గశిర శుద్ధ షష్ఠిని పురస్కరించుకుని సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగాణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి (కుమారస్వామి) ఉదయం 8గంటలకు విశేష అభిషేకం, విశేష అర్చనలు జరిపిస్తారన్నారు. 9 గంటలకు హోమం అనంతరం పూర్ణాహుతి జరిపిస్తారని అన్నారు.

ఈ -క్రాప్ నమోదు తప్పనిసరి



ఉయ్యాలవాడలో ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ: ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయినప్పుడు రైతులు ఆర్థిక సహాయం పొందాలంటే తప్పనిసరిగా పంటలకు ఈక్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి సూచించారు. గురువారం గ్రామ వ్యవసాయ సహాయకులు ఉయ్యాలవాడలో పప్పుశనగ పంటలో చేస్తున్న ఈ క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులతో కలిసి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పంట నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రాప్ నమోదు చేయించడం వల్ల బీమాతో పాటు దిగుబడులు విక్రయించుకునేందుకు, ప్రభుత్వ రాయితీలు పొందేందుకు వీలు కలుగుతుందన్నారు.

మండలంలో రబీలో సాగు వివరాలు

రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 35,150 ఎకరాలు కాగా 31,290 ఎకరాల్లో ఈ ఏడాది వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇప్పటి వరకు ఈ క్రాప్ నమోదు పప్పుశనగ 4,318 ఎకరాలు, మినుము 99, పొగాకు 58, మొక్కజొన్న 19, జొన్న 41, కంది 34, మిరప 38, అలాగే 99 ఎకరాల్లో సాగు చేసిన వివిధ రకాల పంటల ఈ క్రాప్ చేశారన్నారు. ఫసల్‌బీమా చేయించుకునే రైతులు ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నంబర్, పంట వివరాలు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద పొందాలన్నారు.

ప్రీమియం మీ సేవా, కామన్ సర్వీస్ సెంటర్లలో చెల్లించి రశీదు పొందాలన్నారు. ఈ నెల 15 వరకు ప్రీమియం చెల్లించేందుకు గడువు ఉందని తెలిపారు.